మినీకథ

# తప్పుకున్న గొయ్యి

మోహన్రావ్ ఈల వేస్తూ నిలువుటద్దం ముందు నుంచొని తల దువ్వుకుంటున్నాడు. అతను చాలా హుషారుగా వున్నాడు.

"ఎంతసేపటికి తెమలరేమండి, అవతల టైం అయి పోతుంటేనూ?" భార్య సుమతి హడావుడి పడిపోతూ అన్నది.

"వస్తున్నా, అన్నం వడ్డించు" అన్నాడు.

"పదిహేను నిమిషాల్లో ఎప్పుడు భోజనం చేస్తారు? ఎప్పుడు వెడతారు? ఇందాకటే మంచి చెప్తుంటే నా మాట విన్పించుకున్నారు కాదు!" రుసరుస లాడింది.

"అదా నీ సందేహం ధర్మపత్నీ, మనం వెళ్ళిన టైంకే ఫ్లైట్ కదులుతుంది, సరేనా!" అంటూ టెలిఫోన్ దగ్గరకు వెళ్ళి ఏదో నంబర్ డయల్ చేశాడు.



"బేగంపేట ఎయిర్ పోర్ట్" అడిగాడు.

"అవును" అని అవతల నుంచి ఓ కోమలి గొంతు విన్పించింది.

అక్కడే వుండి భర్త మాటల్ని ఆసక్తిగా వింటున్న సుమతి చివరిలో అతను చెప్పిన విషయం విని నివ్వెర పోయింది.

ఫోన్ పెట్టేసి "పద అన్నం వడ్డించు" అన్నాడు.

సుమతి నుదిటిపై చెమట పట్టేసింది.

"మోహన్రావ్ అంటే తమాషా అనుకున్నావా? బుర్ర వుంటే ఏదైనా సాధించవచ్చు" కళ్ళు ఎగరేస్తూ చెప్పాడు.

సుమతి మౌనంగా వుండిపోయింది.

భోజనం చేసిన మోహన్రావ్, సుమతి అందించిన తమలపాకులు అందుకొని "దోసకాయ పచ్చడి అమోఘంగా వుంది" అని భార్య బుగ్గపై చిన్నగా మీటాడు.

సుమతి బ్రీఫ్‌కేస్ అందించింది.

కారును సిద్ధం చేశాడు డ్రైవర్.

కారులో కూర్చుంటూ— "రేపు సాయంకాలానికి వస్తాను, ఈ రాత్రి నా తలపులతో గడిపెయ్—" చేయి ఊపుతూ చెప్పాడు.

ఎయిర్‌పోర్ట్‌కు ఇరవై నిమిషాల్లో చేరుకుంది కారు. అంతా హడావుడిగా తిరుగుతున్నారు. అది చూసిన మోహన్రావ్ చిన్నగా నవ్వుకున్నాడు. డ్రైవర్‌తో కారు తీసుకెళ్ళమని చెప్పాడు. అలాగేనని అతను వెళ్ళి పోయాడు.

మోహన్రావ్‌ని గేటు దగ్గరే ఎయిర్ పోర్ట్ అధికారులు ఆపు చేశారు. జేబులో వున్న ఎయిర్ టిక్కెట్ తీసి చూపాడు.

ఓ అధికారి టిక్కెట్ అందుకొని చూసి— "ఐ థింక్ యు ఆర్ మిస్టర్ మోహన్రావ్" అని అడిగాడు.

"యస్" చెప్పాడు గర్వంగా.

"యువర్ టెలిఫోన్ నంబర్?" అడిగాడు మరో అధికారి.

"65656"

"అరెస్ట్ హిమ్" బిగ్గరగా అరిచాడు.

తుళ్ళిపడ్డాడు మోహన్రావ్. వణికిపోతూ "ఎందుకు?" అని అడిగాడు.

పోలీసు ఇన్‌స్పెక్టర్ క్షణం ఆలస్యం చెయ్యకుండా రెండు చేతులకు బేడీలు వేశాడు.

"నన్నెందుకు అరెస్ట్ చేస్తున్నారు?" అడిగాడు మోహన్రావ్.

"ఢిల్లీకి వెళ్ళే విమానంలో బాంబు వుందని ఫోన్ చేసి అరగంట ఆలస్యంగా వచ్చినందుకు. మిస్టర్ మోహన్రావ్ నువ్వు చాలా తెలివికల వాడిననుకుంటున్నావు. ఈ మధ్య ఇలాంటి సంఘటనలు ఎక్కువ జరుగుతున్నాయని ఇన్‌కమింగ్ కాల్స్‌నన్నింటిని టేప్ చేస్తున్నాము. ఇప్పుడు అర్థమైందా?" కరుకుగా ధ్వనించింది అధికారి గొంతు. మోహన్రావ్‌కి నుంచున్న భూమి కదిలి పోతున్నట్టు అన్పించింది.

పోలీసు ఆఫీసరు మోహన్రావ్ భుజం మీద చేయి వేసి "ఢిల్లీ ఫ్లైట్ ఎక్కవలసిన వాడివి పోలీసు స్టేషన్ గడప ఎక్కుతున్నావ్, పద" అన్నాడు ముందుకు తోస్తూ.

—భగీరథ

## సరిగమలు

వచ్చిన నల్గురు ఆడవాళ్ళని కూర్చోబెట్టి నిమ్మకాయ షర్బత్ కలిపి ఇచ్చింది శారద. అంత దూరం నుండి వచ్చారు, తన కోసమని-వాళ్ళ పరిచయాలు అయ్యాక, అసలు విషయానికి వచ్చారు.వారు నలుగురూ సంగీతం నేర్చుకోవాలని అనుకుంటున్నారుట. ఇంటికి వస్తామన్నారు. ఏవేళ రావాలో చెప్పమన్నారు. శారద కాస్త తికమక పడింది. నిజానికి పెద్ద తీరికలేదు. వాళ్ళ ఇళ్ళదగ్గరే తన రెండవ స్కూలు ఉంది. అక్కడికే వచ్చి వాళ్ళు నేర్చుకోవచ్చు. ఆ మాటే వాళ్ళతో అంది.

### ఒళ్ళు తగ్గే సంగీతం

"అబ్బే, అక్కడ మా పేటలో మేం సంగీతం నేర్చుకోవాలంటే సిగ్గండీ ఎవరైనా ఏమైనా అనుకుంటారు" అన్నారు. అంత తప్పు ఏముందో తెలీలేదు శారదకి.మధ్యాహ్నం పన్నెండుకి తన భోజనం అవుతుందని చెప్పింది శారద. వాళ్ళు పన్నెండుంపావుకి వచ్చేస్తామన్నారు.కుదరదు మధ్యాహ్నం తనకి విశ్రాంతి కావాలంది శారద.

"పోనీ ప్రొద్దున్న అయిదింటికే వచ్చేస్తే?" ఒకావిడ సలహా.

వీళ్ళకి ఇంట్లో పనీ పాటా లేవనుకుంటా - అనుకుంటూ శారద 'నాకు పని వుంటుంది కదండీ' అంది.

మీరేదో ఒక టైమ్ కుదర్చాలి మరి - ఏవో ఒక రెండు, మూడు నెలలు ఫండమెంటల్స్ చెప్పేస్తే ఆ తర్వాత రేడియోలో వచ్చే సంగీత శిక్షణ ఫాలో అయిపోవచ్చు మేం అన్నారు. అవాక్కయిపోయింది శారద. వాళ్ళ అజ్ఞానానికి నవ్వాలో ఏడవాలో తెలీలేదు.

"అసలు మా యింటి దగ్గర ప్రభాకర్‌గారు మావారికి ఫ్రెండ్ అండీ ఆయనెప్పుడూ రమ్మంటారు మమ్మల్ని. తెల్లవారు ఝామున రండి మీకు చెపితే నాకూ ప్రాక్టీసు అవుతుందని" డప్పాలు కొడుతోంది ఒకావిడ.

ప్రభాకర్‌గారు పాతికేళ్ళుగా సంగీత కచ్చేరీలు చేస్తున్నారు. ఆకాశవాణిలో 'ఎ'క్లాస్ ఆర్టిస్ట్ - ఆయన ఇప్పుడు వీళ్ళకి సరిగమలు చెప్తే ఆయనకు అయ్యే ప్రాక్టీసు ఏముంటుంది? శారద వింటూ కూర్చుంది. ప్రభాకర్ గారి ఇల్లు కూడా వాళ్ళకి నిజానికి దగ్గరే. ఇక్కడికి రావాలంటే దూరం. "కాస్త నడక నడిస్తే ఒళ్ళు తగ్గుతుందని మావారు పోరుతున్నారు" ఇంకో మహిళ బాధ. అదీ సంగతి. వీళ్ళకి ఒళ్ళు తగ్గాలి. అందుకు మధ్యాహ్నమైనా, తెల్లవారు ఝామునైనా ఎప్పుడైనా వచ్చేస్తారు.

"చూడండీ! మీకు ఒళ్ళు తగ్గాలంటే వ్యాయామశాలకు వెళ్ళండి - లేకుంటే బ్యూటీ క్లినిక్‌కి వెళ్ళండి - అంతేగాని సంగీతంలో చేరకండి" అంది ఘాటుగా శారద.

—సూరి సత్యవాణి